క్లుప్తంగా

ముస్తాబాదలో రెవెన్యూ గ్రామసభ



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం హాజరై ముస్తాబాద-కేసరపల్లి రోడ్డు మార్గంలో రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జి ప్రాజెక్టు సంబంధించి 2.00 ఎకరాలు భూముల సేకరణకు సంబంధించి రైతులతో మాట్లాడారు. రైతుల సందేహాలకు ఆయన సమాధానం ఇచ్చారు. భూసేకరణలో సమస్యలు, అభ్యంతరాలు అడిగి అర్జీలు స్వీకరించారు. రైతుల సందేహాలను కలెక్టర్‌కు నివేదించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కేవీ శివయ్య, సర్పంచ్ వి.రాధాకృష్ణ, వీఆర్వో నళిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేయాలి



కంకిపాడు: మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. పెనమలూరు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం కంకిపాడు మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్‌గా అన్నే ధనరామ కోటేశ్వరరావు, ఇతర పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ సంక్షేమానికి, అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని తెలిపారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పాలకవర్గం కృషి చేయాలి సూచించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఉయ్యూరు: ఉయ్యూరులో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంటు, విశ్రాంతి భవనం, ఇన్వర్టర్లను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించి ఆసుపత్రి అభివృద్ధి, సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఏవీ శేషకుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కామినేని

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని మాజీ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం హనుమంతునికి కామినేని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటాన్ని ఆయనకు ఆలయ అధికారులు బహూకరించారు.

మద్యం తాగిన మైకంలో హల్‌చల్



గన్నవరం:మద్యం తాగిన మైకంలో ఓ వ్యక్తి నడిరోడ్డుపై హల్‌చల్ చేసిన సంఘటన గన్నవరం మండలం దావాజిగూడెంలోని పామర్తినగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పామర్తినగర్‌లోని మద్యం దుకాణంలో పూటుగా మద్యం తాగిన ఆ వ్యక్తి సమీపంలోని నాలుగు రోడ్ల సెంటర్‌కు చేరుకుని వీరంగం సృష్టించాడు. గన్నవరం-ఉంగుటూరు ఆర్అండ్‌బీ రోడ్డుపై అడ్డంగా పడుకొని వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించాడు. స్థానికులు హెచ్చరించినా లెక్కచేయకుండా కొంత సేపు రోడ్డుపైనే నిద్రకు ఉపక్రమించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా మద్యం దుకాణంలో ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో తాగిన మైకంలో మందుబాబులు హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్యార్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయవాడకు చెందిన శ్రీనటరాజ నృత్య కళాశాలకు చెందిన చిన్నారులు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్యాచార్య రాయన శ్రీనివాసరావు పర్యవేక్షణలో 15 మందికి పైగా శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించారు.

నిధులున్నా.. పనులు సున్నా!

- ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణానికి స్పందించని అధికారులు
- అరకొర వసతులతో సేవలు
- అవస్థలు పడుతున్న ప్రజలు



కానూరులో యూపీహెచ్‌సీ ఏర్పాటు చేయనున్న విలేజ్ క్లినిక్ భవనం

పెనమలూరు:మండల పరిధిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా భవనాల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. దీని కారణంగా మంజూరయిన నిధులు మురిగిపోయే ప్రమాదమే కాకుండా అరకొర వసతులతో వైద్య సేవలు అందుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య శాఖ అధికారులు సకాలంలో స్పందించక పోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. గతంలో పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒక్కటే ఉండేది. మండల జనాభా దాదాపు 5 లక్షలకు చేరుకున్నా మరో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పోరంకిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యనమలకుదురులో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) మంజూరు చేసింది. యనమలకుదురులో దాత ముందుకు వచ్చి రూ.4 కోట్లతో అన్ని వసతులతో యూపీహెచ్‌సీకి భవనం నిర్మించారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత యనమలకుదురు యూపీహెచ్‌సీని ఆరోగ్య శాఖ మంత్రి ప్రారంభించారు. అయితే సిబ్బంది నియామకం, మందులు, ఇతర వైద్య సేవలు సకాలంలో అందించే విషయంలో విఫలమయ్యారు. దాతల కృషితో ప్రస్తుతం యూపీహెచ్‌సీ గాడిలో పడింది.

పోరంకిలో..

పోరంకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేసి సిబ్బందిని నియమించినా పీహెచ్‌సీని వెంటనే ప్రారంభించలేదు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో గత మూడు నెల క్రితమే గ్రామంలో దాత నిర్మాణం చేసిన భవనంలో పీహెచ్‌సీని ప్రారంభించారు. వాస్తవానికి ఈ పీహెచ్‌సీకి సొంత భవనం నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.2.40 కోట్లు నిధులు మంజూరు చేసింది. అయితే అధికారుల స్థలం సేకరించి ఇవ్వక పొవటంతో నేటికీ నూతన భవన నిర్మాణం చేయలేదు. మంజూరైన నిధుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. బీజేఆర్‌నగర్‌లో 18 సెంట్ల స్థలం ప్రతిపాదించగా దానిని ఇప్పటివరకు మంజూరు చేయకపోవటంతో తాత్కలిక భవనంలోనే పీహెచ్‌సీ ఉంది.

ఇప్పుడు కానూరులో..

తాజాగా కానూరులో యూపీహెచ్‌సీని ప్రభుత్వం మంజూరు చేసింది. పటమట నుంచి ఈ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. 15వ ఆర్థిక సంఘ నిధులతో భవన నిర్మాణం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే అధికారులు, పాలకుల్లో స్పందన లేక పోవటంతో భవన నిర్మాణం ఊసే లేకుండా పోయింది. కానూరు మురళీనగర్‌లో గత ప్రభుత్వం నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లో యూపీహెచ్‌సీ ప్రారంభించటానికి సన్నహాలు చేస్తున్నారు. యూపీహెచ్‌సీకి కావాల్సిన సిబ్బంది, పరికరాలు ఇక్కడ లేవు. అన్ని వసతులు సమకూర్చితే తాత్కాలికంగా ఆస్పత్రి ప్రారంభించటానికి అవకాశం ఉన్నప్పటికీ శాశ్వత భవన నిర్మాణం ప్రశ్నార్థకంగా ఉంది. స్థలం కేటాయిస్తేనే నూతన భవన నిర్మాణం చేయటానికి అవకాశం ఉంటుంది. లేకపోతే మంజూరైన నిధులు చేజారుతాయి.

పెనమలూరులో...

పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, మందులు పుష్కలంగా ఉన్నా భవన వసతులు సక్రమంగా లేవు. ఇక్కడి నుంచే ఫీల్డ్ వర్కు మండలం మొత్తం జరుగుతుంది. సీనియర్ వైద్యాధికారి సేవలు ఇక్కడ అవసరముందని గ్రామస్తులు చెబుతున్నారు. పైగా స్వీపర్, వాచ్‌మెన్, అటెండర్‌లు లేరు. వ్యాక్సిన్‌కు సంబంధించి 30 సెంటర్లకు ఇక్కడి నుంచే పంపిణీ జరుగుతుంది. రాష్ట్రంలోనే పీహెచ్‌సీల స్థాయిలో పెద్ద ఎత్తున వ్యాక్సిన్ పంపిణీ ఇక్కడే జరుగుతుంది. దీని కారణంగా సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాక్సిన్‌ను కూడా విభజించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిబ్బంది చెబుతున్నారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించితే చాలా కాలంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందని స్థానికులు తెలుపుతున్నారు.

విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలి



వణుకూరులో మాట్లాడుతున్న మహిళా సంరక్షణ కార్యదర్శి వికల్ప



కానూరులో మాట్లాడుతున్న సీడీపీవో బేబీ సుకన్య

పెనమలూరు: విద్యార్థులు ఉన్నత విద్య నైపుణ్యం, కెరీర్‌పై దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో బేబీ సుకన్య అన్నారు. కానూరులో శుక్రవారం కిశోరి వికాస వేసవి సెలవుల కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత విద్య చదివితే భవిష్యత్తులో లక్ష్యం చేరుకోగలుగుతారన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లిదండ్రులు విద్యార్థులు భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టరాదన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వణుకూరులో జరిగిన కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి వికల్ప మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు స్కిల్స్ సాధించాలని సూచించారు. నైపుణ్యంతో విద్యార్థులు వివిధ కోర్సులు చదువుకోవచ్చని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆపాల్సిన అవసరం లేదని ఓపెన్ యూనివర్సిటీలలో చదువుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కిశోరి బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు రూరల్: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో కిశోర్ వికాస వేసవి శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కంకిపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజినీ పాల్గొని పలు అంశాలపై బాల బాలికలకు అవగాహన కల్పించారు.

నున్నలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు

నున్న(విజయవాడరూరల్): నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం నున్న గ్రామంలో ప్రస్తుతం ఉన్న కమర్షియల్ విద్యుత్ మీటర్లస్థానే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. కొత్త మీటర్లను ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్టు తీసుకున్న సంస్థ సిబ్బంది యజమానులకు కనీస సమాచారం లేకుండా పాత మీటర్లను తొలగించి కొత్త స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడంపై యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మొత్తం దాదాపు 37 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటిలో సుమారు 4 వేలు కమర్షియల్ కనెక్షన్లు ఉన్నట్లు ఏఈ శివారెడ్డి తెలియజేశారు. ఏపీసీపీడీసీఎల్ సంస్థ నుంచి వచ్చిన జాబితా ప్రకారం తొలి విడతగా కమర్షియల్ విద్యుత్ మీటర్ల స్థానే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. అన్ని కేటగిరిల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం పూర్తి చేసిన తర్వాత వినియోగదార్ల నుంచి విద్యుత్ వినియోగంపై ప్రీ పెయిడ్, పోస్టు పెయిడ్ వసూళ్లు ఉంటాయని అంటున్నారు. విద్యుత్ వినియోగం యూనిట్ల మీటర్ రీడింగ్ ఆన్‌లైన్ సిస్టమ్‌లో నమోదు జరుగుతుంది కాబట్టి సిబ్బందితో పనిలేకుండా మీటర్ రీడింగ్ తీయడం జరుగుతుందని సిబ్బంది చెబుతున్నారు. బిల్లు పేమెంట్ కూడా ఆన్‌లైన్లో చెల్లింపులు ఉంటాయంటున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ చోరీలను అరికట్టవచ్చునని చెబుతున్నారు.

చినుకు పడితే చెరువే!



చెరువును తలపిస్తున్న కంకిపాడు బస్టాండు ప్రాంగణం



బస్టాండు వెనుక వైపు రోడ్డులో నిలిచిపోయిన వర్షపునీరు

- వర్షం కురిస్తే జలమయం అవుతున్న బస్టాండు
- రోజులు తరబడి మురుగు నిలిచి అవస్థలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

కంకిపాడు: ఆర్టీసీ సంస్థ నిర్లక్ష్యం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఏళ్ల తరబడి బస్టాండు ప్రాంగణం మెరక చేయకుండా వదిలేయటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. చిన్న పాటి వర్షం కురిసినా బస్టాండు ప్రాంగణం మొత్తం చెరువును తలపిస్తుంది. రోజులు తరబడి మురుగు కదలకపోవటం సమస్య తీవ్రతను రెట్టింపు చేస్తుంది. కంకిపాడు ప్రధాన సెంటరులో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండు ఏర్పాటుచేశారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో బస్టాండు నడుస్తోంది. విజయవాడ-ఉయ్యూరు మార్గంలో ఆటోనగర్ తరువాత బస్టాండు ఉన్నది కంకిపాడులోనే. దీంతో ప్రయాణికుల అవసరాల నిమిత్తం విజయవాడ, గన్నవరం, గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, ఉయ్యూరు తదితర డిపోలకు చెందిన బస్సు సర్వీసులు ఈ మార్గం గుండా నడుస్తున్నాయి.

ప్రధాన కూడలిపై నిర్లక్ష్యం...

సుమారు 40-50 గ్రామాలకు కంకిపాడు ప్రధాన కూడలి. సమీప ప్రాంతాల నుంచి ఎరువులు, విత్తనాలు, దుస్తులు, బంగారు ఆభరణాలు, సామాగ్రి, కూరగాయల కోసం నిత్యం ప్రజలు ఈ ప్రాంతానికి వస్తుంటారు. దీంతో నిత్యం కంకిపాడు సెంటరు ప్రజల రాకపోకలతో బిజీగా ఉంటుంది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడి బస్టాండు నుంచి గమ్యస్థానాలకు చేరుకుంటారు. అలాంటి ప్రాధాన్యం గల కంకిపాడు బస్టాండుపై ఏళ్ల తరబడి నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. బస్టాండు ప్రాంగణం, పరిసరాలు పూర్తిగా పల్లంగా ఉన్నాయి. చిన్న పాటి వర్షం చినుకు పడ్డా ప్రాంగణం అంతా చెరువుగా మారిపోతుంది. వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోయి ఉండటంతో ప్రాంగణం అస్తవ్యస్తంగా తయారవుతుంది. దీంతో బస్టాండుకు వచ్చిపోయే ప్రయాణికులు మురుగు నీటిలో నడుచుకుంటూ బయటకు రావాల్సిన దుస్థితి. బస్టాండు వెనుక వైపు రోడ్డు సైతం ఇదే పరిస్థితి. సరైన మురుగు పోయే మార్గం లేకపోవటం, అందుకు అనువైన చర్యలు తీసుకోకపోవటంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

పరిసరాలు అధ్వానం....

దీనికి తోడు బస్టాండు పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. మురుగు, వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడేపేరుకుపోతున్నాయి. రాత్రిళ్లు బహిరంగ మలమూత్ర విసర్జన ప్రాంగణంలోనే జరిగిపోతున్నాయి. ఫలితంగా దుర్గంధభరిత వాతావరణం నెలకొంటుంది. పరిసరాలు అధ్వానంగా మారి, ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రాధాన్యత గల బస్టాండును నిర్లక్ష్యం చేయొద్దంటూ పలువురు ప్రయాణికులు హితవుపలుకుతున్నారు.

దాసాంజనేయస్వామి దేవస్థానంలో విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్:సీతారామ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర భక్త బృందం ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటల నుంచి 12 గంటల పాటు హరేరామ హరేకృష్ణ ఏకనామ పారాయణం జరిగింది. ఆలయం వద్ద 45 అడుగుల ఎత్తయిన హనుమాన్ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అంతేకాక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 30 అడుగుల ఎత్తైన బెలూన్ హనుమాన్ ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిల్చింది. స్వామి వారి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై సీతారామపురం, ఏపూరు, రైల్వే స్టేషన్, బాపులపాడు ఏరియాల్లో ఊరేగింపు నిర్వహించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

పెనమలూరు: యనమలకుదురులో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుడు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడుకు చెందిన పి.సూర్యచంద్ర భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తాడు. శుక్రవారం ఉదయం యనమలకుదురు కొండ వెనుక ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఐదు అంతస్తుల భవనంలో సిమెంట్ కబోర్డ్ పనికి వచ్చాడు. హ్యాండ్ కటింగ్ మెషన్‌తో పని చేసి వైర్లు కిందకు వేశాడు. అయితే కింద ఉన్న కరెంట్ తీగల పై మెషన్ వైర్లు పడటంతో ఒక్కసారిగా సూర్యచంద్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. కేకలు వేసి పడిపోవటంతో సహచర కార్మికులు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పారు. పోలీసులు విచారణ చేపట్టారు.

పేరంటాలమ్మ ఆలయంలో పూజలు



పేరంటాలమ్మ ఆలయంలో 108 కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రామవరప్పాడు: మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆరోగ్యం కుదుట పడాలని, త్వరగా బెయిల్ మంజూరు కావాలని కాంక్షిస్తూ రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు, నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో మండల స్థాయిలో హాజరైన నాయకులు తొలుత పేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా శీలం రంగారావు మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా కూటమి ప్రభుత్వం వంశీమోహన్‌పై అక్రమంగా కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికే వంశీను మూడు నెలలకు పైగా జైల్లో ఉంచడంతో ఆరోగ్యం క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక కేసులో బెయిల్ వస్తే మరో కొత్త కేసు పెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రాక్షస ఆనందం పొందుతున్నారన్నారు. జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలోనూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వంశీమోహన్ కృషి చేశారే తప్పా ఏనాడూ అవినీతికి పాల్పడింది లేదన్నారు. కుట్ర పూరిత కక్షతోనే వంశీను వేదిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అక్రమ కేసులు పెడుతున్న వారికి బుద్ధి రావాలని, వంశీ మోహన్‌కు మంచి ఆరోగ్యం ప్రసాదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు పన్నినా వంశీ కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోనేరు సుబ్బారావు, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, చెన్ను రవీంద్ర, సమ్మెట లక్ష్మి, లోకసాని లక్ష్మి, తోట సునీత, సొసైటీ మాజీ చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, నల్లమోతు చంద్రశేఖర్, దూరు రత్నం, వేములపల్లి రవి, మెండె సుధాకర్, దండు సుబ్రహ్మణ్య రాజు, రాచమళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వంశీమోహన్ కోలుకోవాలని పూజలు

కేసరపల్లి(గన్నవరం): మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ మండలంలోని కేసరపల్లి యాదవులబజార్‌లో ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో పార్టీ నేతలు కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వంశీమోహన్‌కు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని పూజించారు. జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, పార్టీ నేతలు దాసరి శ్రీనివాసరావు, డీవీ, పలగాని శివాజీ, మాదు వేణు, రాజేష్, బాపట్ల రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో బుడమేరు వంతెన



బలహీనపడి కుంగిపోయిన రామవరప్పాడు బుడమేరు కాలువపై వంతెన

- బలహీనపడి కుంగిన వైనం
- రాకపోకలకు రైతుల ఇబ్బందులు
- వర్షాకాలంలో తప్పని ముంపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో బుడమేరు కాలువపై రాకపోకలు సాగించే వంతెన శిథిలావస్థకు చేరుకుంది. నగరం నుంచి రామవరప్పాడు పలు గ్రామాల మీదుగా బుడమేరు ప్రవహిస్తుంది. గ్రామంలో బుడమేరు కాలువను దాటుకుని వెళ్లడానికి ఈ వంతెనే దిక్కు. గ్రామంతో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు, రైతులు బుడమేరును దాటడానికి ఈ వంతెన మార్గాన్నే అనుసరిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతుల పొలాలు బుడమేరు వైపు ఎక్కువగా ఉండటంతో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పైగా ఈ కాలువ దాటుకుని కొత్తగా నివాసాలు ఏర్పడటంతో వంతెనపై రద్దీ ఎక్కువైంది. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న వంతెన మాత్రం బలహీన పడి ప్రమాదకరంగా మారిన అధికారులు, పాలకులకు మాత్రం పట్టడం లేదు.


బిక్కు బిక్కుమంటూ ప్రయాణం...

పూర్వకాలంలో నిర్మించిన వంతెన కావడంతో శిథిలావస్థకు చేరి రైతులు, గ్రామస్తులు బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన కుంగిపోయి రెయిలింగ్ దెబ్బతింది. కాలువలో రెండు తూముల మీద ఆధారపడ్డ వంతెన క్రమేణా బలహీనపడుతోంది. ఇప్పటికే మధ్య ప్రాంతంలో కుంగిపోయి ఉండటంతో ఏ క్షణాన కూలిపోతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాలిబాటకు, పంట ఉత్పత్తులు తీసుకెళ్లేందుకు మాత్రమే నిర్మించిన ఈ వంతెనపై ప్రస్తుతం రద్దీ పెరిగి రాకపోకలు ఎక్కువయ్యాయి. ఈ వంతెనపై ట్రాక్టర్లు, లారీలు సైతం వెళుతుండటంతో మరింత బలహీన పడుతోందని గ్రామస్తులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన కుంగిపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుడమేరు పొంగినపుడల్లా ఈ వంతెన, సమీప ప్రాంతాలు ముంపుకు గురి అవుతున్నాయి. గతేడాది వచ్చిన వరదల్లో వంతెన పూర్తిగా మునిగిపోయింది. బుడమేరు పొంగడంతో కాల్వగట్టు ప్రాంతాలు కూడా ముంపుకు గురైయ్యాయని తమ బాధలు వ్యక్తబరుస్తున్నారు.

వంతెన అభివృద్ధి పరచాలి...

నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ఈ వంతెన ఎత్తు పెంచి పటిష్టంగా అభివృద్ధి పరచాలని రైతులు, గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు. గత కొన్నేళ్ల క్రితం ఇదే మాదిరిగా వంతెన కుంగిపోవడంతో తాత్కాలికంగా మట్టితో మెరక వేసి పటిష్ట పరిచారు. కొన్ని నెలలుకే వంతెన మరల యథాస్థితికి చేరుకుంది. ప్రమాదకంగా మారిన ఈ వంతెనతో ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు, పాలకులకు మాత్రం పట్టడం లేదు. ఇప్పటికే పలుమార్లు వంతెన అభివృద్ధి పరచాలని కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తబరుస్తున్నారు. బలహీనపడిన ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిషేదిస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వంతెన అభివృద్ధికై నిధులు మంజూరుచేయాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



గ్రామంలోని బుడమేరు కాలువపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. బలహీనపడి, శిథిలావస్థకు చేరిన వంతెనపైనే నిత్యం రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వర్షాకాలంలో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. బుడమేరు పొంగినప్పుడల్లా ఈ వంతెనతో పాటు సమీప ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. వంతెన నిర్మించాలని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. వంతెన ఎత్తు పెంచి పటిష్టంగా అభివృద్ధి పరచాలి.

–వేములపల్లి రవి, రామవరప్పాడు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉంగుటూరు మండలం తేలప్రోలు సెక్షన్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తేలప్రోలు, ఏ. సీతారాంపురం, బండారిగూడెం, పొట్టిపాడు, ఆత్కూరు, నారాఅప్పారావుపేట, పెద్దఆవుటపల్లి, ఆనందపురం గ్రామాలకు పైన తెలిపిన సమయంలో విద్యుత్ ఉండదని తెలిపారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.